# మాడంత మబ్బు

దూరాన—పాలాల మీద చిన్న మబ్బు పట్టినట్టు కనిపించింది.

భాగ్యం నిండుబిందె భుజంమీద నించి గుమ్మంలో దించింది. మనస్సులో అమృత వర్షం కురుస్తోంది.

చటుక్కున కొత్త భయంవేసింది. అతనేమనుకున్నాడో! నా యమ్మకడుపు బంగారం కాను! అదేమిటి, అల్లానవ్వాను? నవ్వు ఆపుకుని నిదానంగా వుండాలనైనా తోచనేలేదు! కాస్సేపటికి తోచింది. కాని నా ముఖంలో కనిపించే వుంటుంది. ఆ అబ్బాయి నివ్వెరపోయాడు.

పదినిమిషాల్కితం నీలాటి రేవులో జరిగినదంతా జ్ఞాపకం వచ్చింది. మళ్ళా అట్టే వీధి గుమ్మంలో నిలబడిపోయింది.

బిందె కాలిమీద మోపేటప్పటికే శేషయ్య ఎదురుగా చీలుబాటమీద ఆగాడు. శేషయ్య, భాగ్యం చిన్నపుడు కలసిఆడుకున్నవాళ్ళే. ఎన్నిసార్లో పొలం గట్టుమీదికి పిల్లి పెసరకాయలకి వెళ్లినప్పుడు వాళ్ళు మురా వీళ్ళుమురా కీచులాడుకునేవాళ్లు. తన పెళ్ళిఅయిన తరువాత భాగ్యం శేషయ్యతో మాట్లాడడమే మానేసింది. మరి, అదేమిటి అల్లాఆగాడు! ఎదురుగానే! భాగ్యంతల వంచుకుని బిందెఎత్తుకో బోయింది.

“పెద్దరాజు వస్తున్నాడు” అన్నాడు. భాగ్యం ముఖం చేటంతయింది! ఏమన డానికీ తోచలేదు. కళ్ళప్పగించి ఊరుకుంది.

వెంటనే, ఉన్నట్టుండి పక్కుననవ్వింది. వెంటనే తెలివి తెచ్చుకుని ముఖం నిబ్బరం చేసుకుంది. శేషయ్య ఒక్క క్షణం ఖంగారు పడ్డాడు. కాని వెకిలిచేష్ట అని వచ్చిన చిరునవ్వు ఆపేసి కాలు కదిపాడు. నాలు గడుగులు వేసి, వెనక్కి తిరిగి “రామగిరి పాడు బస్సుస్టాండులో చూశాను. వాళ్ళఫాక్టరీ యజమానిని బస్సుఎక్కిస్తూ “ఈ సాయంత్రం తప్పక ఇంటికి వెళ్ళిపోవాలి”అంటున్నాడు. నేను కేక వేశాను. బజారు గొడవల్లో అతనికి నా కేక వినబడలేదు. నన్ను చూడనైనా చూడలేదు. నిన్ను చూస్తే చెప్పబుద్ధేసింది.” అని వెళ్లి పోయాడు.

తెప్పరిల్లి, భాగ్యం బిందె ఎగరేసి ఎత్తుకుంది. ఈ వేళ బిందె తేలిగ్గావుంది కూడాను.

ఇంటికెళ్లి పొయ్యి అంటించి వంట చెయ్యాలి. బావకి ఇష్టమయిన కూరలు చెయ్యాలి. ఇపుడిక ఇల్లూఅది శుభ్రంగా సర్ది అన్నీ సరిగ్గా పెట్టాలి. అసలేబస్తీలోవుండి వస్తూండే; తను ఎంతో నాజూగా వుంచాలి ఇల్లు. లేకపోతే, బావమనస్సు ఎంత చివుక్కుమంటుందో!

ఏమిటేమిటో ఆలోచనలతో నడిచింది ఇంటికి. తన సంతోషానికి మేరలేదు. ఆ మాయదారి సంతోషమే శేషయ్యదగ్గర కూడా మర్యాద వుండనివ్వలేదు.

భాగ్యం ఇంట్లోకివెళ్లి, పొయ్యి రాజేసి బియ్యం చాట్లో పోసింది.

పక్క మునసబుగారి పెరట్లోనించి ఎడ్ల మెళ్లల్లో మువ్వల గలగల, పాలేళ్ల అదలింపులు వినబడుతున్నాయి. దుక్కిటెడ్లు దాణా తింటున్నట్టున్నాయి.

**ఎస్. కల్యాణసుందరీ జగన్నాథ్**

భాగ్యం ఇల్లు సర్దడం మొదలెట్టింది. గొంతెత్తి ఏదో కూనిరాగంకూడా ఆరంభించింది.

“మాడంత మబ్బుపట్టె మంగళగిరిమీద
కురిసేను తిరుపతిలో కుంభవర్షాలు”

ఈపాటే అత్తయ్య పాడేది, తన చిన్నపుడు. పాటంతా సరిగ్గా జ్ఞాపకంలేదు :

“కుంభవర్షాలుకురిసె స్తంబాలె తడిసె
వెంకన్నకూచున్న వీధరుగు తడిసె
మంగమ్మకూచున్న మండపమె తడిసె”

మునసబుగారింట్లోనించి అప్పుడే పుట్టింటికొచ్చిన సుబ్బులు “ఏమక్కో రాగాలెక్కువయినాయి. బావస్తున్నాడా, ఏం?” అంటూ పెరటిగోడమీద ముఖం పెట్టింది. భాగ్యం చిరునవ్వుతో తలవంచుకుంది.

“నిజమే ? చెప్పావుగావుగా!” అంది సుబ్బులు. భాగ్యం తలెత్తింది.

“ఏమమ్మా ఇంత చిక్కిపోయావు?” అని ఆశ్చర్యపడ్డది సుబ్బులు. “అయినా చక్కని వాళ్లు చిక్కినా, సన్నని బట్ట మాసినా అందమేనంటారు పెద్దలు,” అంది నవ్వుతూ.

బావ ఎంత చిక్కిపోయి ఉంటాడో అనుకుంది భాగ్యం. బస్తీలో ఏ అమ్మ వండిపెడుతుంది! తనకిది ఇష్టమని చెప్పడు గదా. అసలే స్వయంపాకంమనిషి. అన్నట్టు సన్నచీరలు కట్టాలని ఎన్నాళ్లనించో ముచ్చట సుబ్బులు చీరలు చూశాక. మరీ ఆనల్ల నేతచీర, జరీ చందమామలువేసి నేసింది తన కెంతో సరదా. బావ కొంటానన్నాడు.

వంట చేసుకుంటోంటే గడచిన తన జీవితమంతా - తన కాపురం, అత్తగారు పోవడం లగాయితూ అన్నీ ఒక్కసారి వివరంగా జ్ఞాపకం వచ్చాయి భాగ్యానికి.

ఆయేడు చేను ఈనినవెంటనే సుంకుమీద వాన ముసుళ్ళు పట్టాయి. ఎల్లాగో కాలక్షేపం చేశారు. ఆ మరుసటి ఏడూ అంతే.

తరువాత ముంపు వచ్చింది - వరుసగా రెండేళ్ళు. అసలు ఆయేడు ముంపువస్తుందని భాగ్యానికీకూడా ముందరే తెలుసు. తొలకరికి ముందు ప్రక్కవూళ్ళోవున్న చుట్టాలని చూసి వస్తూంటే, కొల్లేరు ఎండివుంది. అక్కడక్కడా గుంటల్లో నీళ్ళున్నాయి. జమ్ము నిలువెత్తుకు పైగా పెరిగి వుంది. రాజు చూడమన్నాడు. జమ్ములో కొంగలు నిలువెత్తున గూళ్ళు కట్టుకున్నాయి. పెద్దిరాజు నిలబడిపోయాడు. “ఈయేడుముంపువస్తుందే. మనగతి ఏమిటో! గూళ్ళు చూడు, ఎంత ఎత్తుగా కట్టాయో పిట్టలు, ఈయేడు!” అన్నాడు. భాగ్యం క్రుంగిపోయింది.

“మన పల్లపుచేలికి ఈ గతి తప్పదుగా” అన్నాడు మరో ఆయన ప్రక్కన నిలబడి— భాగ్యంతో. ఇప్పుడు జ్ఞాపకం వస్తూంది; ఆ అన్నది శేషయ్యే. వాళ్ళింటికి వెళ్లి వస్తూంటే సాగనంపడానికికూడా వచ్చాడు. అదేం ? బావ అల్లా మిరిమిరి చూశాడు ? తాను శేషయ్యతో మాట్లాడితే బావ కిష్టం లేకపోయేది ! అసలు భాగ్యం మాట్లాడేదే కాదు. ప్రయాణంలో ఏదో సందర్భంలో అవసరం వచ్చింది. తను జవాబు చెప్పింది. ఏదో కొంటెగానే చెప్పినట్టు జ్ఞాపకం, బావ అండ చూసుకుని. శేషయ్య నవ్వాడు. కాని బావ కోపం దిగమింగాడు. ఇంటి



కొచ్చేవరకూ ఎవ్వరూ ఏమీ ఎక్కువ మాట్లాడలేదు. ఊరు పెద్ద చెరువుగట్టుమీది నించే, శేషయ్య భద్రంగా వెళ్ళిరమ్మని చెప్పి తిరుగుముఖం పెట్టాడు.

అసలు బావ ఎవ్వరితో మాట్లాడినా ఒప్పుకోడు. తను అదో మోస్తరు. మిగతా విషయాల్లో దేవుడిలాంటివాడు.

భాగ్యం తృప్తితో, చిరునవ్వుతో తల వంచుకుని కూరలు తరుగుతూంది.

అల్లాగే ఇదివరలో ఓనాడు బావ సంతకి వెళ్ళి, మర్నాడుగాని రానన్నాడు. అంతా జ్ఞాపకం వచ్చింది. ఒకవేళ ఎల్లాపోయి ఎల్లా వస్తుందో, ఎందుకైనా మంచిదని ఓ లోటా పాలు కాచి, కిటికీలో పెట్టింది. మునసబుగారి భార్య రెండు బంతిపువ్వులిస్తే తల్లో పెట్టుకుంది. అనుకున్నట్టు సంతలో పడ్డబేరం కుదరలేదు. పెద్దిరాజు ఆనాడే, ఇంటికి తిరిగి వచ్చాడు. కాచినపాలు, తల్లో పూలూ చూచి చాలా చికాకుపడ్డాడు. భాగ్యానికి అర్థంకాలేదు. ముఖం చిన్నపుచ్చుకుంది. భాగ్యం పాలవైనం, పువ్వులవైనం (బతిమాలి చెప్పేటప్పటికి ఆరాత్రి తొలికోడి కూసింది. తన అనుమానాలకి పెద్దిరాజు సిగ్గుపడ్డాడు. చాలా నొచ్చుకున్నాడు. భాగ్యం అర్థంచేసుకుంది. "పోనిలే, నామీద నువ్వు కోపగించుకోపోతే ఇంకెవ్వరు కోపగించుకుంటారు బావా వెర్రిగాని," అంది. కాని తనకీ కోపమే. ఒక్కొక్కసారి ఇకనల్లా కోపగించుకోకూడదు; అసలు బావ ఎంత అనుమానంగా ప్రవర్తించినా తనే ఓపికగా వుండాలి. బావ రాంగానే ఈముక్క చెప్పేద్దామని నిశ్చయించింది భాగ్యం.

మేనకోడల్ని పెంచి కోడుక్కి చేసుకుంది అత్తయ్య. పుట్టింటివారు లేనికొరత లేకుండా చూస్తాడు పెద్దిరాజు; భార్యని అరచేతిలో నిమ్మపండులా చూసుకుంటాడు అనుకుంది.

ఒకసారి మునసబుగారి భార్య రెండు తామరకాయలిచ్చింది. "నాకివి చాలా ఇష్టం, చిన్నమ్మా" అంది భాగ్యం. వినకట్టే వున్నాడు బావ. రెండో నాటికి సందెడుకాయలు వచ్చి పడాయి ఇంట్లో! భాగ్యం గుండె నీరైపోయింది. కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. బావకి నీటి గండం ఉందని అంటుండేది, అత్తయ్య.

అన్నీ జ్ఞాపకం వస్తున్నాయి.

కనకం - వాళ్ళ ఆవు మునసబుగారింట్లో ఒక్కరంకె వేసింది.

చివరికి ఆవునికూడా మునసబుగారికి తోల వలసివచ్చింది. ఒక కష్టమా! వరసగా చేను పండక, అప్పులపాలైనారు భాగ్యమూ, రాజున్నూ. ఆఖరికి గత్యంతరం లేక రామగిరి పాడుబస్తీలో కూలి పనికైనా ఒడబడాడు- వున్నవూళ్ళో అయితే, పువ్వులమ్మిన ఊళ్లో కట్టెలమ్మినట్టుంటుంది అని. పైగా బస్తీకి పోయి నాలుగురాళ్ళు సంపాదిస్తే అప్పులు తీరితే అదే చాలు. ఈసారి నడుము కట్టి పొలంలో బంగారం పండిస్తానన్నాడు రాజు.

నాళ్లు గడచినాయి. వర్షాలు ఎక్కువగా కురిశాయి. చెరువులో తామరలు, కలువలు కలకలలాడుతున్నాయి. చేలల్లో నీళ్ళు నిలగట్టారు.

స్వతంత్రం, నమ్మకంమీద మునసబుగారి నే నూర్పి కుప్పవెయ్యమని చెప్పి బస్తీకి బయలుదేరాడు రాజు. త్వరలోనే తిరిగి వస్తానన్నాడు.

ఆనాటి దృశ్యం కళ్ళకి కట్టినట్టు వుంది భాగ్యానికి. రోజంతా అదోమాదిరిగా వున్నాడు రాజు. ఏదో బాధపడుతున్నట్టు కనిపించాడు. ఆ ముఖం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా భాగ్యానికి కడుపు తరుక్కుపోతుంది.

ఆనాడు భోంచేస్తూ "నువ్వు ఒంటరిగా ఉండగలవా?" అని ఛటాలున అడిగాడు.

"నీతో నేనూ వస్తా"నన్నది. రాజు కళ్లెర్రచేశాడు. "బస్తీ నమ్మకూడదు. అక్కడికొద్దు" అన్నాడు. భాగ్యం మాట్లాడలేదు. సుబ్బులూ వాళ్ళంతా, బస్తీపోవడంలేదూ? బావకిష్టంలేదు. అంతే. "ఇక్కడే మన్నావెర్రిచేష్టలు చేశావా, నేను దేశాంతరం పోతా"అన్నాడు. భాగ్యం గుండె గభగభా కొట్టుకుంది. "అదేమిటల్లాగ!" అంది గాభరాగా.

రాజు చిరునవ్వు తెచ్చుకున్నాడు: "భయపడకు. నాకసలు కోపంఎక్కువ"అన్నాడు.

భాగ్యం మనస్సు మరింత బరువెక్కింది. రోజంతా ఇద్దరూ మాట్లాడకుండానే గడిపారు.

ఆ సాయంత్రం "రేపీ వేళకి బస్తీలో ఉంటావు బావా! పల్లెటూరు జ్ఞాపకం ఉంచుకుంటావా? మేము జ్ఞాపకం ఉంటామా!"

# మాడంత మబ్బు

అని చిరునవ్వు తెచ్చుకుని అంది భాగ్యం.

పంచెలు మడతలు పెట్టుకుంటున్న రాజు, తలెత్తకుండా "నల్లజలతారు చీర తెస్తానులే," అన్నాడు కొట్టొచ్చినట్టు.

మరో క్షణం గడిచింది. "అసలు ఇంతకష్టం నాకెందుకు - నీ కోసంగదూ? మనం ఎపుడూ ఇట్లాగా ఉంటామని ఎల్లా చెప్పడం? పెద్దలు గడించినదైనా తరువాత వాళ్ళకి ఇచ్చిపోవద్దూ?" అన్నాడు వినీ వినబడని స్వరంలో. భాగ్యం గుండె కరిగిపోయింది. బావమోస్తరే అది.

మరునాడు, తూర్పు తెల్లవారకముందే బస్సు రోడ్డుకి బయలుదేరాడు పెద్దిరాజు. పొలం గట్టువరకూ సాగనంపి వస్తానని, మునసబుగారు కూడా పొన్నుకర్ర చేత పట్టుకుని బయలుదేరాడు.

"ఇక నివ్వుండు. భద్రం," అని మాత్రం అన్నాడు పెద్దిరాజు. "నేను సాగనంపి వస్తానులే. నివ్వు ఇంటికి పదమ్మాయి" అన్నారు మునసబుగారు.

అక్కడే, వీధి చివరనే ఆగిపోయింది భాగ్యం. నోటమాట రాలేదు. తన గుండె లెవ్వరో బలవంతంగా ఈడ్చుకుపోతున్నట్టు అయింది తనకి.

మసక మసకగా ఇద్దరు మగాళ్ళూ రోడ్డు మలుపుదాటాక భాగ్యానికి గొంతువచ్చింది. శుభంగావెళ్ళి లాభంగా తిరిగి రమ్మంది.

ఆ దీవెన్ని ఆకాశంమీద ఆఖరు చుక్క మాత్రం విన్నది.

నాటినించీ భాగ్యం జీవితం బరువుగానే నడుస్తున్నది. ఒంటరిగా గుప్పెడు బియ్యం ఉడకేసుకుని తినడం అంటే "ఎందుకులే" అనిపించేది. క్షుద్బాధకోసం ఆ నాలుగు గింజలూ పొయ్యిమీద పెట్టినపుడల్లా, రాజు తిన్నాడో లేదో, ఎల్లా ఉన్నాడో! అక్కడ ఎవ్వరి నడుగుతాడు! అడిగేమనిషి కాదాయె. అన్న బాధ ఎక్కువయ్యేది. కళ్ళల్లో నీళ్ళు చిమ్ముకొచ్చేవి.

నురిపిడి అయిపోయింది. అసలే సారం లేని భూమి. తప్పాతాలూపోను, ఏదో గ్రాసానికి మట్టుకు గింజలు చేరాయి. మునసబుగారు తన ఇంట్లోనే గరిసె కట్టించారు.

కాని, హృదయంలో బరువు తగ్గలేదు. సూర్యభగవానుడు అటు ఉదయించి, ఇటు క్రుంకుతున్నాడు. నిన్న నేడూ అనే వివక్షత లేకుండా రోజులు గడచిపోతున్నాయి భాగ్యానికి.

పెరట్లో బూరుగచెట్టు పూతపూసి కాయ కాచింది. వేసవి గడుస్తూంది.



అర్జంటుగా కావలసినపుడు మీ దుస్తులను
24 గంటలలో కుట్టించుకోగలరు

మీరు 24 గంటలలో చొక్కా కుట్టించుకోవాలంటే 'సాన్ఫొరైజ్‌డ్' లేబిలుగల బట్ట కొనండి. 'సాన్ఫొరైజ్‌డ్' ట్రేడు మార్కుగల బట్టను కుట్టే ముందు తడపనక్కరలేదు కనుక మామూలుగా అయే 48 గంటల ఆలస్యము తగ్గును. ప్రొద్దున్న 'సాన్ఫొరైజ్‌డ్' ట్రేడు మార్కుగల బట్ట కొని, క్రుంగకుండా సరిపోయేలా ఉండే దుస్తులను మర్నాడు ధరించండి!

లేబిలుమీద 'SANFORIZED' REGD TD MK
ఈ గుర్తు ఉన్నదా అని గమనించండి

అలాచేస్తే మీ దుస్తులు చాలనట్లుగా ఎన్నటికీ క్రుంగవు!

రిజిస్టరు చేయబడిన 'సాన్ఫొరైజ్‌డ్' అనే ట్రేడు మార్కునకు అధికారులైన క్లూయట్, పీబోడీ అండ్ కంపెనీ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమితమైన బాధ్యతతో యు. ఎస్. ఎ. లో సంస్థాపితము) వారిచే ప్రచురింపబడినది. ఈ కంపెనీ యొక్క కచ్చితమైన ప్రమాణములకు తగినట్లు క్రుంగకుండా ఉండే బట్టలమీదనే 'సాన్ఫొరైజ్‌డ్' ట్రేడు మార్కు వేయుటకు అంగీకారము యిస్తాము.

వివరములకు: 'సాన్ఫొరైజ్‌డ్' సర్వీస్, 95, మెరీన్ డ్రైవ్, బొంబాయి 2

ACP. 4369

సంపాదన లేకపోతే పోనీలే. పొలంపోతే పోనీ. ఒక్క గూటో పడిఉంటే చాలు. మునసబుగారిచేత కాగ్గు వ్రాయిద్దామా అనుకుంది కూడాను ఎన్నోసార్లు - భాగ్యం. రాజు చటుక్కున విసేమనిషీగాదు. అప్పు తీర్చకపోతే నామోషీ పడతాడు. అప్పుడే నాలుగైదుసార్లు తపాలో డబ్బు పంపాడు కూడాను, మునసబుగారిపేర. చేతి ఖర్చుకి ఆ డబ్బు తనకే ఇయ్యమన్నాడు.

మృగశిర ప్రవేశించింది. మునసబుగారు తన మళ్ళతోపాటు రాజు దుక్కికూడా ఆరంభించాడు.

అనుకోకుండా ఈ వేళ బావ వస్తున్నాడు.

ఈ పరమానందంలో వంట అయిపోయింది. బయట చిన్నచిన్న చినుకులు ఆరంభమయినాయి. వెలిగించిన హరికేను లైటు చుట్టూ నుసుములు బొంయ్ బొంయ్ మంటూ తిరుగుతున్నాయి. మునసబుగారి గొడ్ల సావిట్లో, పశువులకి పెట్టిన పొగ ఇల్లంతా అలుముకుంది.

రెండు కంచాలూ కడిగింది.

పక్క ప్రక్కన పీటవేసి కంచాలు పెట్టింది. తన ధైర్యానికి తనకే ఆశ్చర్యం వేసింది.

అసలు కాపరం మొదలెట్టాక ఇద్దరూ కలసి భోంచెయ్యందే! ఆ సరికొత్త పెళ్ళి ముచ్చట్లు ఏమో అంతే!

రెండు లోటాల్లో నీళ్ళు పెట్టింది. స్వయంగానే వడ్డించుకొని తినొచ్చు. సుబ్బులూ వాళ్ళాయనా బస్తీలో ఇంతేనట. సుబ్బులు ఎన్నోసార్లు చెప్పింది.

అప్పుడే సుబ్బులు పంపించిన బస్తీ ఆకులు, వక్కలు మంచంమీదనే పెట్టి వుంచింది. కబుర్లు చెప్పుకుంటూ సున్నం రాసుకొవచ్చు ఆకులకి.

కొంపతీసి, బావ అనుమానం పడడుగదా! తన అనుమానాలకి తనకే నవ్వొచ్చింది భాగ్యానికి! అయినా బావని నవ్వించేద్దాం అనుకుంది.

రెండు రవికెలూ, మార్చి, మార్చి తొడుక్కుంది శ్రద్ధగా.

అన్నం తినగానే బెల్లంగడ్డ నోట్లో వేసుకునే అలవాటుంది బావకి. ఇంట్లో బెల్లం లేదు. వీధిచివర భూషణంగారింట్లో అమ్ముతారు. తానెప్పుడూ వెళ్ళలేదు. పైగా బయట సన్నటి జల్లుపడుతూంది. మరి బెల్లం లేదే - ఎల్లా?

బావకి ఇంటిముందర దారి తెలియటానికి లైటు పడేటట్టు కిటికీ తెరిచిపెట్టి తలుపు గొళ్ళెంపెట్టి, తడుస్తూ బయలు దేరింది.

"ఏం కోడలూ వానలో వచ్చావు? రా," అంటూ చాప చూపించింది జానికమ్మగారు, భూషణంగారి భార్య. భాగ్యం ముస్తాబుచూసి తబిసీళ్ళు అడిగి తెలుసుకుంది. బెల్లం చేతికిచ్చి బొట్టెట్టి, వాళ్ళ చిన్నవాణ్ణి తోడిచ్చి, తిరిగి పంపింది.

వర్షం కొంచం పెద్దదైంది. తలుపు తియ్యగానే, హరికేనులైటు గప్‌గప్‌మంది, బైట గాలి విసురికి.

తాను బస్సురోడ్డు కేసి చూస్తూ గుమ్మంలోపలిగా కూచుంది - తలుపుని ఆనుకుని. ఇటు తిరిగి, ఇంట్లోకి చూసింది - తెరిచిన కిటికీలోనించి జల్లుపడదల్లే ఉంది. కిటికీ లోపల క్రింద, క్రీనీడతడిసి నలగాఉంది. అయినా కిటికీ మూయ తలుచుకోలేదు. మూస్తే, బావకి దారి చీకటి.

వర్షం మరింత పెద్దదయింది. గాలి విసురు ఎక్కువయింది. మెరుపు మెరిసినప్పుడల్లా ఎదురుగా బస్సురోడ్డు క్షణంసేపు కనిపిస్తూంది. అల్లాగే బయటికి చూస్తూ కూచుండి పోయింది భాగ్యం. నిద్రమాత్రం రావడం లేదు.

రాత్రి రెండుజాములైంది. బయట గాలి హోరు ఎక్కువయింది. భాగ్యానికి భయం వేసింది. ఇక ఈరాత్రి బావరాడు. ఇక రేపే. పోనీలే ఈ మాయదారి వర్షంలో ఏం ముంచుకు పోయిందని తను తొందరపడం అనుకుంది.

కిటికీలోనించి జల్లు నట్టింటి వరకూ పడుతూంది. భాగ్యం లేచి కిటికీమూయబోయింది.

కిటికీ క్రీనీడలో కాలుక్రింది మెత్తగా ఏదో వస్తువు తగిలింది. భాగ్యం చటుక్కున వెనక్కి గెంతింది.

ఇందాక బయటనించీ రాగానే కనిపించింది ఇదే—తడిగాదు. మసక వెలుతురులో అల్లా కనిపించింది.

దీపం తెచ్చి దగ్గరగా చూసింది. ఓ చిన్న బొక్కిసా అది. చేత్తో మెల్లగా ఎత్తింది. బావ నీలం చొక్కాయిలో చుట్టిన ఏవో గుడ్డలు మెత్తగా తగిలాయి.

అయితే బావ వచ్చేశాడు. ఏడీ? మునసబుగారింటికి వెళ్ళాడా ఏం! తను ఇంట్లో లేనందువల్ల! అప్పుడే వచ్చి ఉండాలి. అయితే ఇంతిసేపు వారింటో ఏం చేస్తున్నట్టూ? గుమ్మంలోకి వెళ్ళి వంగి ప్రక్కఇలు చూసింది. తలుపులన్నీ మూసి ఉన్నాయి. దీపాలే లేవు. వాళ్లంతా ప్రశాంతంగా నిద్రపోతున్నారు.

భాగ్యానికి ఏమీ తోచలేదు. ఆలోచనలు పరుగెత్తుతున్నాయి. లోపలికి ఉరికింది. ఆ మూటని నిదానించి చూచింది. మెల్లగా విప్పింది. లోపల, బావతీసికెళ్ళిన గుడ్డలు, క్రొత్తది ఓ నల్లటి చీరా ఉన్నాయి. దీపం వెలుగులో, చీరమీద జరీ అక్కడక్కడ తళతళలాడింది. జరీ చందమామల చీర. తన కోసం. ఎంతజ్ఞాపకం పెట్టుకు తెచ్చాడు, బావ!

అయితే కిటికీక్రింద తడిలో పెట్టడమేం, మంచంమీద పెట్టకుండా.?

భాగ్యానికి వెర్రి ఎత్తినట్టనిపించింది. తల పడిపోతున్నట్టయింది.

అక్కడే చతికిలబడిపోయింది.

మరుక్షణం, ఇటువైపుగా కంచాలమధ్య చెల్లా చెదురుగా ఏవేవోపడి ఉన్నాయి. తన కాళ్ళకి దగ్గరగా బావ మనీపర్సుపడి ఉంది. చేతికి చాలా బరువుగా వుంది. ఓ బస్సు టిక్కెట్టు, ఒక రసీదు. వేలెడు కర్ర పెన్సిలూ పడి వున్నాయి.

గుప్పున అర్థం అయింది—భాగ్యానికి కిటికీలోనించీ విసిరిపుచ్చుకొని బావ లోపలికేశాడు—వీటన్నిటినీ. కోపంగా వేసినట్టుంది. ఎందుకంతకోపం? వేసి, ఎక్కడికెళ్ళాడు?

తల పగిలిపోతూంది!

బయట చూరునీళ్ళు కిటికీ ప్రక్కగా ఏకధారగాపడుతున్నాయి. గాలి ఈల వేస్తూంది. వర్షం ఎక్కువయింది. కుంభవృష్టి.

భాగ్యం వీపుమీద జల్లుపడుతూంది. మెదలలేదు. బిత్తర చూపులు చూసింది. తన చుట్టూ వెలుగులు నీడలు ఒకేలాగు కనిపించాయి. భాగ్యానికి.

కళ్ళనిండా నీళ్లునిండాయి.

మరుక్షణమే తన వెనక ఆకాశంమీద పెద్ద మెరుపు మెరిసింది.

కళ్ళెదుంగు, తళతళాతోమిన రెండు కంచాలు, రెండు లోటాలు తటుక్కున మెరిశాయి.

బయట వర్షపు రొద. ★

